క్లుప్తంగా

సామూహిక ఎలుకల నివారణతో మేలు



శంఖవరంలో ఎలుకల నివారణ మందు తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

శంఖవరం: వరి సాగు చేసిన రైతులందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించాలి. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రతిరోజూ పంటను పరిశీలించడం ద్వారా ఎలుకల ఉధృతిని తెలుసుకోవచ్చన్నారు. పొలం గట్లను శుభ్రంగా ఉంచి, గట్టు సైజు తగ్గించాలన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కొండరాజులబాబు పండగ



ప్రత్తిపాడులో కొండరాజులబాబును దర్శించుకుంటున్న క్వారీ కార్మికులు

ప్రత్తిపాడు: స్థానిక క్వారీ ప్రాంతంలో శుక్రవారం కొండరాజులబాబు పండగ ఘనంగా నిర్వహించారు. క్వారీ కార్మికులు, గ్రామస్తులు కొండరాజులబాబుకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా క్వారీ కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రత్తిపాడులో గత నాలుగేళ్లుగా రాళ్లు కొట్టుకుంటూ జీవనోపాధి పొందేవారమని, అయితే ప్రభుత్వం కొండలను ఏపీఐఐసీకి కేటాయించడంతో ఉపాధి కోల్పోయామన్నారు. ప్రభుత్వమే తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్వారీ కార్మిక సంఘ నాయకులు శింగిలిదేవి భద్రం, గుండు సత్యనారాయణ, కసిరెడ్డి బాబ్జి, కర్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి



దాడిలో తీవ్రంగా గాయపడిన గోవిందరాజు

గోకవరం: వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై శ్రీనివాస్‌రావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన అండిబోయిన గోవిందరాజు శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై కృష్ణునిపాలెం వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పీతా సత్యనారాయణ, దొడ్డి రాజేష్, మరొక వ్యక్తి కలిసి బైక్‌పై వచ్చి గోవిందరాజును అడ్డగించి వారి వెంట తెచ్చుకున్న కర్రలతో తలపై తీవ్రంగా కొట్టి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన గోవిందరాజు తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించిన మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విజిలెన్స్ దాడులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బిందు డ్రింకింగ్ వాటర్ యూనిట్‌పై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌బీ బాగ్చి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా వాటర్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

కూలిన రైలింగ్



శృంగరాయునిపాలెం వంతెనపై శిథిలమై కాలువలోకి జారిపోయిన రైలింగ్

కిర్లంపూడి: మండలంలోని శృంగరాయునిపాలెంలో పంట కాలువ వంతెనపై ఉన్న ఇనుప రైలింగ్ శిథిలమై నీటిలో పడిపోయింది. గ్రామానికి ప్రధాన రహదారి కావడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణ సమయంలో ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైలింగ్‌ను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శివపూజకు వేళాయె..

- మహాశివరాత్రికి సర్వం సిద్ధం
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు

ఏలేశ్వరం: గ్రామాల్లో మహా శివరాత్రి సందడి నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు శైవక్షేత్రాలను సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో విశిష్టమైన శివాలయాలు ఉన్నాయి. వీటికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది శివరాత్రి, శని త్రయోదశి ఒకేరోజు రావడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఏలేశ్వరంలోని ఏలేరునది ఒడ్డున ఉన్న శివాలయం ఎంతో విశిష్టమైంది. కాశీక్షేత్రంలో ఉండే విధంగా ముఖద్వారం దక్షిణవైపు ఉండి ఎదురుగా శశ్మానాన్ని ఆనుకుని ఏలేరునది ఉండడం ఇక్కడ ప్రత్యేకం. మహా శివరాత్రి సందర్భంగా ఈ శివాలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏటా మహాశివరాత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు వస్తారు. దీంతో అర్చకులు మహేష్, శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద బారికేడ్లు నిర్మించారు. విశిష్టమైన బ్రహ్మణరేవును రూ.40 లక్షల నిధులతో ఆధునీకరించారు. రేవుతో పాటు శివాలయం పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

ఏలేరునది వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళల కోసం ప్రత్యేక గూడారాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో నుంచి ఏలేరు నదికి వెళ్లే అన్ని ద్వారాల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. శివాలయం సమీపంలోని రహదారులన్నింటికీ విద్యుత్ దీపాలు ఏర్పాటుచేశారు. శివాలయం సమీపంలోని కై లాసథామాన్ని ఆనుకుని శివుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏలేరుపై నిర్మించిన వంతెన దెబ్బతినడంతో నదిలో నుంచి ప్రత్యేక దారి ఏర్పాటు చేశారు.

మహా శివరాత్రి వేడుకలకు రెడీ

తుని: మహా శివరాత్రిని శనివారం వైభవంగా జరుపుకునేందుకు తుని నియోజకవర్గంలోని భక్తులు



గోకవరంలో కొలువైన గోకర్ణేశ్వరస్వామి

సమాయత్తమయ్యారు. తెల్లవారు జాము నుంచే భక్తులు పుణ్యస్నానాలకు స్థానిక తాండవ నది వద్దకు వస్తారు. ఈ మేరకు స్నానాల కోసం ఘాట్ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. పెద్దవీధి, గవరపేట శివాయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, ఇందుకు అనుగుణంగా క్యూలైన్లు, అభిషేకాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి గుడి సమీపంలో బ్రహ్మకుమారీస్ భవనంలో శివలింగం, జీఎన్‌టీ రోడ్డు ధారాలమ్మ గుడి ఎదురుగా శ్రీవాణీ అపార్ట్‌మెంట్‌లో రుద్రాక్ష శివ లింగం ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ భక్తులను దర్శనానికి



ఏలేరు నదిలో ప్రొక్లెయిన్‌తో ప్రత్యేక దారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనుతిస్తామని బ్రహ్మకుమారీలు తెలిపారు.

రత్నగిరి ముస్తాబు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సత్యదేవుడు విష్ణుమూర్తి అవతారమైనప్పటికీ స్వామివారి ఎడమ పక్కన అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారు, కుడి పక్కన శివుడు లింగాకారంలో దర్శనమిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఏటా శివరాత్రి రోజున శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా శనివారం స్వామివారికి లక్ష చేమంతి పూజ, మహాన్యాశ పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ తెలిపారు.



ఏలేశ్వరంలో శివరాత్రికి ముస్తాబైన శివాలయం

కొండ దిగువన

కొండ దిగువన పంపా సత్రం వెనుక గల భూలోకేశ్వర స్వామివారి ఆలయంలో రాత్రి ఎనిమిది గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

గోకవరంలో..

గోకవరం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. గోకవరం మండలంలో కొత్తపల్లిలో సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోకవరం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, స్థానిక మురళీనగర్‌లోని సోమేశ్వరస్వామి ఆలయం, రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయం, తంటికొండలోని అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వర స్వామి ఆలయం, కృష్ణునిపాలెంలో విశ్వేశ్వరస్వామి ఆలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

తొండంగిలో..

తొండంగి: శివరాత్రి వేడుకలకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. తొండంగిలోని రామలింగేశ్వరాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. దాతలు సహకారంతో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. బెండపూడి, పీఈ చిన్నాయపాలెం, ఒంటిమామిడి, అద్దరిపేట, శృంగవృక్షం, పంపాదిపేట గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

జల.. జల.. జలపాతం

- పుణ్యస్నానాలకు ఆకర్షిస్తున్న జలపాతాలు
- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

ప్రత్తిపాడు రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యాత్రికులను మండలంలోని ధారపల్లి, యరకంపాలెం, తోటపల్లి జలపాతాలు రా..రమ్మంటున్నాయి. ఎత్తయిన కొండలు, ఆ కొండలపై నుంచి సహజ సిద్ధంగా జాలువారే జలపాతాలు, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మహాశివరాత్రికి యాత్రికులను ఆకర్షిస్తున్నాయి. ఈ జలపాతాల చెంతకు ఏటా జిల్లా నలుమూలల నుంచి భారీ ఎత్తున యాత్రికులు తరలివచ్చి పుణ్యస్నానాలు చేసి సమీపంలో ధారమల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దానికి అనుగుణంగా



ధారపల్లి జలపాతం వద్ద పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు (ఫైల్



యరకంపాలెం జలపాతం వద్ద యాత్రికుల సందడి

నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో..

మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుంది. సాధారణ రోజుల్లో కూడా ఇక్కడకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఇక్కడకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. అలాగే ఒమ్మంగి ఉమారామలింగేశ్వరస్వామి, ధర్మవరంలోని విశ్వేశ్వరస్వామి, శరభవరంలో రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువెళ్తా



తాండవ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి రాజా

- మంత్రి దాడిశెట్టి రాజా

తుని: తాండవ సుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువెళ్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరంలో తన క్యాంపు కార్యాలయంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు మంత్రి రాజాను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో ఆపరేటివ్ సెక్టారులో ఉన్న చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం శాశ్వతంగా మూసి వేయడం లేదన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి చక్కెర ఆధారిత బల్క్ యూనిట్లుగా మార్పు చేస్తారన్నారు. తాండవ సుగర్ ఫ్యాక్టరీని మాత్రం యథావిధిగా ఉంచి వినియోగంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు రాజా తెలిపారు. కార్మికుల జీతాలకు సంబంధించిన బకాయిలను రెండు నెలల్లో విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారు. తాండవ సుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు ఎస్‌వీ రమణ, బీవీ రమణ, సాల్మన్‌రాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు



లోవలో తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ధళే చిట్టిబాబుతో పాటు 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారికి శుక్రవారం మహాచండీ హోమం నిర్వహించారు. వేదపండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, పురుషోత్తమ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులక దర్శనం కల్పించినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.

112 మందికి కంటి పరీక్షలు

తుని: స్థానిక రాజా కళాశాల ఆవరణలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కిరణ్మయి ప్రాథమిక కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 112 మందికి కంటి పరీక్షలు చేసినట్టు వాకర్స్ ఎలెక్ట గవర్నర్ చదరం శివాజీ తెలిపారు. తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 112 మందికి పరీక్షలు నిర్వహించగా, 56 మందికి శుక్లాలు ఉన్నట్టు గుర్తించి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, కుందెం సత్యనారాయణ,



తునిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు రాజ్యలక్ష్మి. చిత్రంలో వాకర్స్ ప్రతినిధులు

చోడిశెట్టి బాబూరావు, జూరెడ్డి చిరంజీవి, కుసుమంచి సత్యనారాయణ, నేరెళ్ల సత్యనారాయణ, డాక్టర్ రాజ్యలక్ష్మి, క్యాంపు ఆఫీసర్ సోమేష్, దుర్గ, రత్నం పాల్గొన్నారు.

19న పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు

జగ్గంపేట: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 19న స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పాతంశెట్టి సతీష్‌బాబు, కరస్పాండెంట్ ఆళ్ల రవి కిషోర్ శుక్రవారం తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పదో తరగతి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సిలబస్ మీద ఈ ఈ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శనివారం సాయంత్రం లోపు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు

శంఖవరం: గ్రామాల్లో 2021–22 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం నుంచి సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ జె.రాంబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. మండలంలోని 14 పంచాయతీలకు సంబంధించి ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై ఇప్పటికే నివేదికలు సేకరించామన్నారు. సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో పర్యటించి జరిగిన పనులు గుర్తించడంతో పాటు ప్రజల ద్వారా వివరాలు తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డీఆర్పీ ఎ.మధు, ఏపీఓ రాజగోపాల్, హౌసింగ్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అవగాహన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు డిగ్రీలో అందిస్తున్న పలు రకాల కోర్సులపై అవగాహన కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిగ్రీలో తీసుకునే కోర్సులపై అవగాహన కల్పించామని చెప్పారు.

22, 23 తేదీల్లో సైన్స్ ఫేర్

కాకినాడ సిటీ: ఈనెల 22, 23 తేదీల్లో ఏఎంజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్సు ఫేర్‌కు తీసుకోవల్సిన చర్యలపై డీఈఓ అన్నపూర్ణ కమిటీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఏఎస్‌ఏ సమావేశ మందిరంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సైన్స్ ఫేర్‌కు జిల్లాలో 21 మండలాల నుంచి 105 ప్రాజెక్టులు, 5 సబ్ థీమ్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకినాడ అర్బన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జెడీ రాజు మాట్లాడుతూ సైన్స్ ఫేర్ నిర్వహణ బాధ్యతలకు కమిటీల ఏర్పాటు, కమిటీలు నిర్వర్తించే పనులను తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, అర్బన్ డీఐ వీపీజీ వాణీకుమారి, రూరల్ మండల ఎంఈవో ఎల్.గణేష్‌బాబు పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామికి మహా కుంభాభిషేకం



నందన వనంలో నాగలింగేశ్వరస్వామికి మహాకుంభాభిషేకం చేస్తున్న భక్తులు



స్వామివారిని అభిషేకించేందుకు సప్తనదీ జలాలతో క్యూలో నిలుచున్న భక్తులు

రౌతులపూడి: మహాశివరాత్రిని పురస్కరించుకుని శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందన వనంలో స్వయంభూ వెలసిన నాగలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వర్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివభక్తులు, మహిళలు ఈ మహాకుంభాభిషేకం చేశారు. తొలుత మహిళా భక్తులు కలశాల్లోని జలాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలశాల్లోని జలాలతో స్వామి, అమ్మవార్లను అభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఉమావైద్యనాథేశ్వరస్వామి, భూపాలపట్నం రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం మండల ఏపీటీఎఫ్ శాఖ నాయకులు స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రతినిధి కేఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణం మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న 50 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు గోరస దుర్గాప్రసాద్, ఎన్ శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేరులో 81.58 మీటర్ల నీటి నిల్వలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జలాశయంలో మంగళవారం నాటికి నీటినిల్వలు నిలకడగా ఉన్నాయి. ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు గాను 81.58 మీటర్లు, 24.11 టీఎంసీలకు 15.32 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో నీటి నిల్వలు సమృద్ధిగా పెరిగాయి. దిగువ ఆయకట్టుకు 600, స్పిల్‌వే ద్వారా 250, విశాఖకు 200, తిమ్మరాజుచెరువుకు 60 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఎక్కువగా ఉన్నందున వచ్చే వేసవికి దిగువ ప్రాంతానికి తాగునీరు, ఆయకట్టుకు సాగునీటి సమస్య తీరనుంది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: అనకాపల్లి జిల్లా గుల్లిపాడు – తుని రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (33) మృతి చెందాడు. స్థానిక జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. పాయకరావుపేట మండలం నాగరాజుపేట గేటు సమీపాన పట్టాలు దాటుతున్న ఆ వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వివరాలు లభ్యం కాకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని ఎస్సై కోరారు.

